# సుధ

రచన:
ఆదిభట్ల లక్ష్మి

'అమ్మాయ్ సుధా' నాలుగయింది లేచి కాఫీ తాగమ్మా; అన్న సావిత్రమ్మ మాటలకు, సుమారు గంటనుండి ఈ లోకంలో లేని సుధ, ఆలోచనలకు ఆనకట్ట కట్టి, ఆ...వస్తున్నా అమ్మా అంటూ వంట ఇంట్లోకి దారి తీసింది.

కాఫీ తాగుతున్నా కూడా మళ్ళీ, పదే, పదే గంట క్రితం పోస్టుమాన్ ఇచ్చి వెళ్ళిన 'ఇంటర్వ్యూ' గూర్చి ఆలోచిస్తోంది. ఎల్లుండే ఇంటర్వ్యూ, ఇంతకీ ఉద్యోగం వస్తుందో రాదో, ఎన్ని రికమండేషన్లు ఉండాలో ఈరోజుల్లో, వచ్చినా ఆఫీసరెలాంటి వాడో, వయసులోవున్న వాడయితే అన్నివిధాలా కష్టమే, అదే పెద్దవాడైతే హాయిగా వెళ్ళివచ్చేయొచ్చు అనుకొంది. మళ్ళీ తల్లిపిలుపుతో ఈ లోకంలోకి వచ్చింది సుధ.

'ఏమిటే ఆలోచిస్తున్నావ్ కాఫీ చల్లారి పోతూంటే ఆ...ఏం లేదమ్మా...అంటూ కాఫీ తాగేసి లోపలికి వెళ్ళిపోయింది. 'అమ్మతో చెప్తే మొదటికే మోసం, అసలు ఇంటర్వ్యూకే వెళ్ళనీయదు. ఆడపిల్లకి ఉద్యోగం ఏమిటి అంటుంది. అమ్మకేం తెలుసు నాన్నగారు పడుతున్న అవస్థ? అందరాడ పిల్లలాగే తనకూ ఎన్నో ఆశలు, ఆశయాలూ వున్నాయ్. కానీ ఏమిటి లాభం! ఆర్థికంగా తన పరిస్థితి ఏమంత బాగులేదు. నాలుగు నెలలై తండ్రి సుబ్బారావ్ గారు రిటైరైపోయారు. తమ్ముడు మధు మెడిసెన్ చదువుతున్నాడు. ఇంకా వాడి చదువు ఏడాది వుంది. అక్కసునంద ఈనెలలో పురిటికి వస్తుంది. విపరీతమైన ఖర్చుల సమయం, ఎంత పెన్షన్, పంట, ఇది వచ్చినా ఏం చాలుతుంది ఈ ఖర్చులకి అనుకుంది సుధ.

సుబ్బారావుగారు బెంగతో సగం అయిపోయేరు. ఆయన పనిచేసినంతకాలం దర్జాగా వెళిపోయింది. సునందకి మంచి సంబంధం. బాంకిలో ఉద్యోగం, కుర్రవాడు బాగున్నాడు అని క్రితంసంవత్సరమే పెళ్లిచేసేరు. సుధకి బి. ఏ వరకు చెప్పించారు. మధు మెడిసన్ చదువుతున్నాడు. అప్పట్లో ఆయన రెండుచేతులా ఆర్జిస్తున్నారు కనుక ఏవిధమైన ఇబ్బంది లేకుండా ఇల్లు గడచిపోతోంది. పిల్లలకు ఎలానూ చదువులు వస్తున్నాయి కదా అని జాయిన్ చేసేరు. ఇప్పుడు మధు చదువు ఇంకా ఏడాది వుండగానే ఆయన రిటైరై కూర్చున్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో కూడా తనకి పెళ్ళిచేస్తానంటే సుధే వద్దంది. ఒక్క ఏడాది ఆగుతే తమ్ముడు చదువు పూర్తయి చేతికి వస్తాడు, అప్పుడు చూసుకోవచ్చు, ఈ లోగా తాను ఉద్యోగంచేస్తే ఆర్థికంగా ఇంటికి సహాయపడవచ్చునన్న ఊహాలు. సుబ్బారావుగారు కాదనలేకపోయారు. ఆయన మాత్రం ఏం చేయగలరు, పరిస్థితుల ప్రభావం మరి.

'సుధ చాలా ఆఫీసుకి అప్లికేషన్స్ పెట్టి ఇంటర్వ్యూ కోసం ఎదురుచూస్తున్న సమయంలో వచ్చిందా ఇంటర్వ్యూ.

♦ ♦ ♦

ఆ రోజు ఉదయం నాలుగ్గంటలకే సుధ లేచింది. తెల్లవార్లూ ఇంటర్వ్యూ గురించే ఆలోచిస్తు ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూసింది.

బ్రష్‌మీద పేస్టు వేసుకొని తోటంతా కలయ తిరుగుతూ, పళ్ళుతోయటం పూర్తిచేసింది.

వంట ఇంట్లోకి వెళ్ళేసరికి సావిత్రమ్మగారు ఆసరికే తల స్నానంచేసి, జారు ముడివేసుకొని, నుదుట ఎర్రని కుంకుమ బొట్టు పెట్టుకొని, అట్ట కచ్చ కట్టుకొని, పార్వతీదేవిలా వెలిగిపోతోంది. పూజా మందిరంలో పూజకోసం పూజ సరంజామా అంతసర్దుకుంటోంది. ఆ సమయంలో సుధకి తల్లిని డిస్టర్బ్ చేయటం ఇష్టంలేక తనే కాఫీ కలుపుకు తాగి, తన పొడుగాటి జడను ఇప్పి నూనె రాసుకొని, స్నానాల గదిలోదూరింది. రోజూ అయితే బాత్రూంలో ఏవో సినిమా పాటలు కూనిరాగాలు తీయటం అలవాటు కానీ, ఈ రోజు మాత్రం నిశ్శబ్దంగా స్నానం ముగించేసి వచ్చేసింది.

సావిత్రమ్మగారు ఓర్పుగల మనిషి. ఎంతపనైనా విసుగులేకుండా చేస్తుంది.

పాపం అమ్మ నన్ను ఏపనీ లేకపోయినప్పుడూ, ఇంట్లో ఖాళీగా వున్నప్పుడే పిలిచేది కాదు, అలాంటిది ఇంక ఉద్యోగం అయితే అలసిపోతున్నావంటూ ఏపనీ చెప్పదు. ఏమిటో పిచ్చి అమ్మ. అసలు అమ్మకి ఇంటర్వ్యూకి వెళ్ళటమే ఇష్టం లేదు. ఆడపిల్ల కష్టంమీద బతకటం ఏమిటి అంటుంది. తనకి కూడా అక్కయ్యలా పెళ్లిచేయ్యలేదని అమ్మ బాధ, ఇన్ని ఆలోచిస్తూనే పనులన్నీ తెముల్చుకొనేసరికి ఏడుగంట అయిపోయింది, రేడియోలో తెలుగు వార్తలు అయిపోతున్నాయి. టైమయిపోతున్నాది అనుకుంటూ గబగబా డ్రస్సుచేసుకుంది. గులాబీరంగు ఫుల్ వాయిల్ చీర, అదేరంగు జాకెట్టు వేసుకొని, తల్లో ఎర్ర గులాబీతోటలోది తెంపి తురుముకొంది. చక్కగా చెక్కిన బొమ్మలా వుంటుంది సుధ కాలేజీ అంతా సుధ చక్కదనాన్ని మెచ్చుకొనేవారు. అలాంటి సుధకి ఇప్పుడు తన అందం గూర్చి ఆలోచించే అంతటి తీరిక లేదు.

‘ఎనిమిది గంటలవుతూండగా తల్లికి, తండ్రికి చెప్పటానికి వెళ్లింది. పాపం సుబ్బారావుగారు మనసంతా గందరగోళంగా వుంది. దీవించి అత్తవారింటికి పంపవలసింది పోయి, ఇంటర్వ్యూకి పంపుతున్నాను అనుకొన్నారు.

ఆదేమిటి నాన్నా అలా బాధపడతారూ, నే వెళ్లేది ఇంటర్వ్యూకేగా, అన్న సుధ మాటలకు, నీకేం తెలుస్తుంది తల్లీ, ఈ తండ్రి హృదయం అని మనస్సులోనే ఆక్రోశించేరు.’

చిటుకు చిటుకుమంటూ ఆఫీసు మెట్లెక్కిన సుధ అక్కడ తనలాగే వెయిట్ చేస్తున్న అమ్మాయిలిద్దరు కనిపించారు. అమ్మయ్య అనుకుంటూ గుండెలనిండా వూపిరి పీల్చుకొంది. వాళ్ళిద్దరూ స్టయిల్‌గా తయారయి బాగా చదువుకొన్నట్టున్నారు, అయినా తెలివి తక్కువగాని ఈ కాలంలో పొట్ట చీలుస్తే అక్షరంలేని వాళ్ళు కూడా అత్యంత ఆధునికంగా తయారవుతున్నారు. అలాంటిది వుద్యోగానికి వచ్చారంటే చదువులేకుండా రారుకదా? అలాంటప్పుడు వీళ్ళు తయారయ్యారంటే తప్పులేదు అనుకొని వాళ్ళ వైపు చూసి చిరునవ్వు నవ్వింది. వాళ్ళు కూడా వెంటనే నవ్వితే వాళ్ళ డిగ్నిటీకి లోపం అన్నట్టుగా తప్పని సరిగా నవ్వేరు.

‘మెల్లగా ఆఫీసరొచ్చేసరికి తొమ్మిదయింది. మళ్ళీ సుధకి గుండెదడ ప్రారంభమయింది. ఆఫీసర్‌ని చూసేక అమ్మయ్య నేననుకున్నట్లే పెద్దాయనే, దేవుడి దయవల్ల ఇక్కడే ఉద్యోగం అయితే బాగుండునని వెయిదేముళ్ళకి మొక్కుకుంది మనసులో-

ప్యూన్ వచ్చి ముందర వచ్చిన అమ్మాయిలిద్దర్లో ఒకమ్మాయిని, ఆఫీసర్ గారు రమ్మంటున్నారు అన్నాడు. ఆ అమ్మాయి లోనికి వెళ్ళింది. ఆ అమ్మాయికి ఎక్కడా భయం ఉన్నట్లు కనిపించలేదు. చాలా ధైర్యంగా వయ్యారంగా నడచుకొంటూ వెళ్లింది. అరగంటతర్వాత ఆ అమ్మాయి రాగానే, రెండో అమ్మాయికి కాల్ వస్తే ఆ అమ్మాయికూడా మొదటి అమ్మాయిలా చాలా ధైర్యంగా వెళ్లింది. సుధకి ఇదంతా చూస్తూంటే ఏమిటోలావుంది, ఇదేమిటీ వీళ్ళంతా ధైర్యంగా వున్నారు తనెందుకు ఇలా వణికి పోతోంది, అనుకొంది గుప్పిటపట్టిన చెమట తుడుచుకుంటూ.

రెండవ అమ్మాయి రాగానే సుధకి తన ఛాన్సు వచ్చింది. మెల్లగా ధైర్యం కూడదీసుకుంటూ, తడబడే అడుగులతో ఆఫీసర్ రూమ్‌లో అడుగుపెట్టింది!

భయంతో .వణుకుతున్న సుధవైపు చూసి చిరునవ్వుతో, రామ్మా అలాకూర్చో అన్నారు కుర్చీవైపు చూపుతూ.

‘ఏమ్మా భయపడుతున్నావా’ అంటూ ఫైల్సుచూసుకుంటూ పరవాలేదు అన్నారు.

అతని చల్లని మాటలు సుధకి మంచువర్షం కురిసినట్లయిం ధైర్యాన్ని కూడ తీసుకుంటూ, అంతవరకూ బిగపట్టుకున్న వూపిరి ఒక్కసారి వదిలింది. అమ్మయ్య అనుకొంది.

‘నువ్వు ఏం పాసయ్యావ్’ అన్నారు ఆఫీసర్ రఘురాంగారు.

‘బి. ఎ. పాసయ్యానండీ, టైప్ షార్ట్ హాండ్ లోయర్ పాసయ్యాను’ అంది సుధ.

‘ఆల్ రైట్ టైపిస్ట్‌గా పనికొస్తావన్నమాట’ అన్నారు.

మళ్ళీ ఆయనే మీ ఫాదరేం చేస్తున్నారు అన్నారు

‘రిటైరైపోయారు, ప్రస్తుతం ఏంలేదు. స్టేషన్ మాష్టర్‌గా చేసేవారండీ అందిచేతవేళ్ళవైపు చూసుకుంటూ,

‘ఆహా అలాగా, మంచిపోస్టే, అని ఏవో ఇంటర్వ్యూ విశేషాలు నాలుగైదడిగారు.

అంతా అయ్యాక, ధైర్యంగా వుండమ్మా భయం లేదు అని చెప్పి, ఇక వెళ్ళమ్మా అంటూ ఆయనకూడా సీట్లోంచి లేచి బయటకు వెళ్ళారు.

‘సుధ కూడా పైకివచ్చేసి చుట్టూ కలయ చూసింది. వచ్చినప్పుడు చుట్టూ ఉన్న పరిసరాలు గుర్తించే పరిసితుల్లో లేదు. ఇప్పటికీ లోకంలోకి వచ్చింది కనుక చుట్టూ చూస్తూ ముందుకుపోయింది. మెట్లు దిగుతూ చూస్తే చక్కగా చుట్టూ గార్డెన్ అందులో మంచి మంచి పూల మొక్కలు నిండుగా పూలతో చూడముచ్చటగా వుంది అప్పుడే అర్డర్సు వచ్చేసినంత సందర పడిపోయింది.

తొందరగా బస్ కాచ్ చేసి ఇల్లు చేరేసరికి, ఇంత ఆలస్యం అయిందేమ్మా అంటూ ఆత్రుతగా తల్లి అడిగిన దానికి, మరి ఏలామ్మా ఇంటర్వ్యూ కావద్దూ అంటూ లోపలికి దారితీసింది.

అంతవరకూ కూతురు కోసం ఎదురు చూసి అప్పుడే భోజనం ముగించి తాంబూలం వేసుకొని ఈజీ చైర్‌లో కూర్చున్నారు. సుధ రావటం చూసి, ఎంత పడచ్చేవు, తొందరగా కాళ్ళు కడుక్కొని భోజనం చెయ్యమ్మా అన్నారు.

‘అలాగే నాన్నా’ అంటూ వంట ఇంట్లోకి వెళ్లి వడ్డిం

(తరువాయి 19వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

చుకుంటూన్న కూతుర్ని చూసి, వస్తున్నానే సుధా నే వడ్డిస్తా అన్నారు సావిత్రమ్మగారు.

ఫరవాలేదమ్మా ఇంతవరకూ అలసింది చాలదూ, చిన్నపిల్లనా ఏమిటి, నేవడ్డించుకు తింటాలే అంది. అయినా ఆవిడ వడ్డించ నారంభించేరు.

ఏమిటీ ఆవిడకి తనచేత్తో పెడితేనే గాని తృప్తి వుండదు. ఏమిటో పిచ్చి అమ్మ అనుకోంది సుధ.

♦ ♦ ♦ ♦

రోజులు తొందరగా దొర్లి పోతున్నాయ్, వారం రోజుల తరువాత ఆర్డర్స్ కాయితం చూసేసరికి ఆనందంతో కూడిన, ఆశ్చర్యం కలిగింది. తనకేనా నిజంగా ఉద్యోగం రావటం అనుకోంది సుధ, చెక్కుట చేయ్యి చెయ్యిజేర్చి.

'అమ్మాయ్ నాకు ఉద్యోగం వచ్చింది, అంటూ వెనకపాటుగా వచ్చి తల్లి భుజాలమీద వాలుతూన్న సుధని, బియ్యంలో రాళ్లు ఏరుతున్న సావిత్రమ్మగారు త్రుళ్ళిపడి, నిజంగానా' ఏమిటో తల్లీ, నీ ఉద్యోగం అంటే నాకు బెంగగా వుంది అన్నారు.

ఆ మర్నాడే సుధ ఉద్యోగంలో చేరవలసిన రోజు. తొందరగా లేచి ఎంతో హుషారుగా తయారు కాసాగింది. వచ్చే నెలనుండి తన తండ్రికి అంత బాధ, ఇబ్బందులు వుండవు అనుకోంది! సుధ.

తల్లీ తండ్రికీ చెప్పి ఆఫీసుకు బయలుదేరింది సుధ.

♦ ♦ ♦ ♦

ఆఫీసు మెట్లెక్కుతూ వుంటే ఏదో క్రొత్త అనుభూతి కల్గింది మెల్లిగా ఆఫీసులో అడుగు పెడుతున్న సుధకి.

రఘురాంగారు తలవంచుకోని ఏవో ఫైల్సు చూసుకోంటున్న వారలా అలికిడికి తల ఎత్తి 'రామ్మా కూర్చో! చూసావా ఎంత భయపడ్డావో, ఉద్యోగం వచ్చేసింది. అన్నారు నవ్వుతూ!'

'సుధ కూడా అంతా మీ దయే అంది చిరునవ్వు నవ్వుతూ.'

'బాగుందమ్మా మధ్య నాదయ యేముంది, నువ్వు సెలక్టు, పైకి అలా అన్నారే కాని నిజంగా అయితే ఆయన కావాలనే సెలక్టు చేసారు. ముందు వచ్చిన అమ్మాయిలు ఇద్దరూ ఉద్యోగం అవసరం వుండి వచ్చినట్టు లేదు. వాళ్ళ ప్రవర్తన కూడా ఆయకి నచ్చలేదు. సుధ నమ్రత, అమాయకత్వమే ఆయన చేత సుధకి ఆర్డర్సు పంపేటట్లు చేసేయి సుధకి చెప్పవలసిన వర్కు అప్పచెప్పి ఏ సెక్షనో చెప్పారు!

తన రూంలోకి అడుగుపెట్టిన సుధ చుట్టూ కలయ చూసింది. ఇద్దరాడవాళ్లు, ఒక మధ్య వయస్కుడు, హెడ్ క్లార్కు బాబోలు వున్నారు. అమ్మయ్య ఫరవాలే అనుకోంది.'

ఆ రోజు టైపు చేయవలసిన కాగితాలు ప్రక్కన పెట్టుకోని, ఈ రోజునుంచి తాను బాధ్యతగల వ్యక్తి అనుకుంటూ, టైపు చెయ్యసాగింది. ఇన్నాళ్ళూ చదువుకోటం, అమ్మ చేసింది తినటం తప్ప తనకేం బాధ్యతలు లేవు. ఈ వేళనుంచి అలాకాదు, చాలా జాగ్రత్తగా నడచుకోవాలి అనుకోంది సుధ.

♦ ♦ ♦ ♦

కాలప్రవాహంలో రోజులిట్టే గడచిపోతున్నాయి. ఆఫీసుకి వెళ్లటం, రావటం, రొటీన్ వర్కయిపోయింది సుధకి, సావిత్రమ్మగారే ఇంటిపనంతా జేసుకుపోతూ వుంటారు. సుధ సాయం చెయ్యకపోతే, అలసి పోయి వస్తావు, గొంతులో మెతుకులు గొంతులో వుండగానే పరుగెడుతావు అంటు ఒక్క పనీ ముట్టనీదు.

(సశేషం)




# కథాంజలి

[స్థాపితము 1938]

విడి ప్రతి ... 25 పై.

సంవత్సర చందా ... రూ 5-00

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాథమ్స్, స్వదేశమిత్రన్ బుక్ స్టాల్స్‌లోనూ దొరకును.